క్లుప్తంగా

వాహనాల తనిఖీ

రాయచోటి టౌన్ : ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ జయగోపాల్ హెచ్చరించారు. సీఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన రహదారులలో వాహనాల చెకింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో శుక్రవారం రాయచోటి – రాజంపేట, సుండుపల్లె రోడ్డు క్రాస్‌లోని చెక్‌పోస్టు వద్ద వాహనాలను అటవీశాఖ అధికారులతో కలసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా వాహనదారులకు సలహాలు ఇచ్చారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



టీకాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి కొండయ్య

రాయచోటి టౌన్ : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే దోమల ఆవాసాలు లేకుండాపోతాయని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్. కొండయ్య అన్నారు. శుక్రవారం ఆయన జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ వేణుగోపాల్‌తో కలసి రాయచోటి పట్టణంలోని కొత్తపల్లెలో ఉన్న యుపీహెచ్‌సీని తనిఖీ చేశారు. అనంతరం ఇళ్ల ఎదుట ఉన్న మురికిని పరిశీలించిన తరువాత ఆయన స్థానికులకు సలహాలు – సూచనలు అందజేశారు. మురుగునీరు నిల్వ లేకుండా చేసుకోవాలని చెప్పారు. క్రమం తప్పకుండా చిన్న పిల్లలకు వ్యాధి నివారణ టీకాలు సక్రమంగా వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు.

వెన్నపూసను గెలిపించాలి

సిద్దవటం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కడప వైఎస్ఆర్‌సీపీ నాయకుడు వెన్నపూస ప్రతాప్‌రెడ్డి కోరారు. సిద్దవటం మండలం లోని భాకరాపేట, 11వ బెటాలియన్, సిద్దవటంలో శుక్రవారం ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కరపత్రాలను, నామూనా బ్యాలెట్ పేపర్లను పట్టభద్రులకు అందజేశారు.

6 నుండి నీలకంట్రావుపేట దుర్గా ఉరుసు

రామాపురం : మండలంలోని నీలకంట్రావుపేట పంచాయితీలో సద్గురు సమీపంలోని దర్గా వద్ద శ్రీ సద్గురు హజరత్ దర్బార్ అలీషా వలి రహమతుల్లా అల్లెబాబా జలీల్ మస్తాన్ వలి ఉరుసు 6 వ తేదీ నుండి నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. ఈ సందర్భంగా 6వ తేదీ గంధం, 7న జెండా మెరవని ఉరుసు, 8న తహలీల్ మహా ప్రసాదం ఇవ్వడం జరుగుతుంది. మండలం నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుండి ఈ ఉత్సవాలకు భక్తులు తరలివస్తారు. 7న రాత్రి దర్గాలో హిందూ మహమ్మదీయ సోదరుల సహకారంతో గొప్ప ఖవాలి నిర్వహించనున్నారు. ఖవాలిలో ముంబైకి చెందిన ఖలీల్ సైదా, బెంగళూరుకు చెందిన అస్మాని నిఖబ్‌ల మధ్య పోటీ ఉంటుందని భక్తులు తెలిపారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

రాజంపేట రూరల్: పట్టణంలోని రాజుహైస్కూల్‌లో ఆదివారం ఉచిత ఆక్యుపంక్చర్ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు కడపకు చెందిన డాక్టర్ గిరీష్‌దేవపురం శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే ఈ వైద్యశిబిరంలో కీళ్లనొప్పులు, నడుమునొప్పి, సయాటికా, భుజమునొప్పి, మైగ్రేన్, నిద్రలేమి, పక్షవాతం వంటి సమస్యలతో బాధపడుతున్నవారు పాల్గొనాలని కోరారు.

బొప్పరాజు పర్యటను విజయవంతం చేద్దాం

రాయచోటి అర్బన్ : ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు రాయచోటి పర్యటనను విజయవంతం చేద్దామని జిల్లా ఏపీ జేఏసీ అధ్యక్షుడు నరసింహకుమార్, మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.మల్లికార్జునలు ఒక సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈనెల 4వ తేదీన బొప్పరాజు రాయచోటి పట్టణంలో పర్యటిస్తారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, పొరుగు సేవల ఉద్యోగుల సమస్యల సాధన అంశంలో భాగంగా బొప్పరాజు జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నారన్నా రు. స్థానిక సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో మధ్యాహ్నం 3.30గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు మండల సమావేశం

సిద్దవటం: సిద్దవటం మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ బి. పులిరామ్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు వెలుగు కార్యాలయ సభా భవనంలో, మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన జరుగుతుందన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అలాగే మండలం లోని అన్ని శాఖలకు సంబంధించి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి పర్యవేక్షణలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు మంగళహారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు రాహుకాల పూజ విశేషాలను ప్రధాన అర్చకులు వివరించారు. ఈ పూజలలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు కూడా పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ భద్రకాళీ అమ్మవారు



రాహుకాల పూజలలో పాల్గొన్న మహిళ భక్తులు



వేడుకగా సీతారామ కల్యాణం

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని రెడ్డీస్ కాలనీలో వెలసిన శ్రీ రామాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ కమిటీ అధ్యక్షులు కెవి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామ చంద్రమూర్తి జన్మనక్షత్రం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారి కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామవారికి అభిషేకాలు, గణపతి పూజ, లక్ష్మీనారాయణ హోమం నిర్వహించారు. ఈ పూజలు, హోమాలు వేదపండితులు రాంప్రసాద్ శర్మ, ప్రభాకర్ శర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. బండ్రెడ్డి ఓబులరెడ్డి, బండెడ్డి చంద్రకళ (ఝాన్సీ) దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడంతో పాటు పూజలలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

పెనగలూరు: వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ సభ్యులను భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి తెలియజేశారు. శుక్రవారం సింగనమలలో ఆయన మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎర్రి నరసింహులు వైఎస్సార్ సిపి నాయకులతో సమావేశమయ్యారు. రాయలసీమలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న రామచంద్రారెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రవీంద్రారెడ్డిలను గెలిపించాలన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతోందన్నారు. పేదలందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉదయగిరి సుబ్బరాయుడు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, సింగనమల సర్పంచ్ ఎర్రి శివయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు శంకరయ్య, పలువురు నాయకులు, ఓబిలి మాజీ సర్పంచ్ పులి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం

నందలూరు (రాజంపేట): దాతల సహకారంతో నందలూరు జిల్లాపరిషత్ క్రీడామైదానంకు సంబంధించి కూలిన గోడ పునరుద్ధరణ చేసినట్లు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లానేత , ప్లేగ్రౌండ్ యూత్ సభ్యులు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. దాతల సాయంతో గోడను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రికెట్ సబ్‌సెంటర్ కోచ్ ఫైరోజ్‌ఖాన్‌లోడి, క్రికెటర్ శివకోటి, అరవపల్లె ప్లేగ్రౌండ్ యూత్ సభ్యులు సుధాకర్, పెంచలయ్య, రాంప్రసాద్, మాధవయ్య, పెంచలయ్య, హరి, వెంకటయ్య, అరవింద్, విజయ్, ఫరీద్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

దేవరెద్దు మృతి



మృతిచెందిన దేవరెద్దును ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం కురవపల్లెలో ఉన్న దేవరెద్దు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శ్రీ మాలే పెద్దయ్య స్వామి జాతరలో ఈ దేవరెద్దు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ వస్తోంది. అలాంటి దేవరెద్దు మృతిచెందడంతో గ్రామస్తులు సాంప్రదాయపద్ధతిలో ఊరేగింపుగా తీసుకెళ్లి దహన సంస్కారాలను నిర్వహించారు.

ప్రత్యేక పూజలు



పుల్లంపేట: అనంతంపల్లిలో వెలసి ఉన్న మేడాలమ్మ తల్లి అమ్మవారికి శుక్రవారం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. 41 రోజులపాటు అమ్మవారికి నిత్యం అభిషేకాలు, పూజలు చేస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారు మేడాలమ్మ తల్లి అని భక్తులు అంటున్నారు.

పదవ తరగతి మొదటిమెట్టు



ప్రేరణ తరగతులలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమశాఖ అధికారి జాకీర్ హుస్సేన్

చిట్వేలి: విద్యార్థుల భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి 10వ తరగతి మొదటి మెట్టు అని జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి జాకీర్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం స్థానిక కేంద్రీకృత వసతి గృహంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో 10వ తరగతి చాలా కీలకమైందని, బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

రైల్వేకోడూరు సాంఘీక సంక్షేమశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసమూర్తి, స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, కరుణమ్మ, యుగంధర్, గోపిలు విద్యార్థులకు మెలకువలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు హైమావతి, తిరుపతి, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు

చిన్నమండెం : మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6వ తరగతి నుండి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్ , ఎన్ఎస్ఎస్ పీఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెనగలూరు: పెనగలూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు ఏర్పాటు చేసిన గదులను, పరిసర ప్రాంతాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తహశీల్దార్‌తో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం వద్ద మంచి గదులను ఎంచుకొని పకడ్బందీగా ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మండలంలోని నారాయణ నెల్లూరు వద్ద వ్యవసాయ భూములను ప్లాట్లుగా వేసి అమ్మకానికి పెట్టిన కన్వర్షన్ భూమిని తహశీల్దార్‌తో కలిసి సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ పరిశీలించారు. ఈ ప్లాట్లలో నిర్మాణాలు చేపడితే వారిపై కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ శ్రీధర్ రావు, సబ్ కలెక్టర్లు తెలిపారు. ఈ భూమిపై పూర్తి సమాచారం తమకు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

వీరబల్లి: రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బండి సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం మట్లి తొగట పల్లిలోని స్వయం సహాయక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత కింద పొదుపు డబ్బులు అంతర్గత రుణాలుగా పొందాలన్నారు. అనంతరం బ్యాంక్, స్త్రీనిధి, సీఐఎఫ్ ఇతర రుణాలు తీసుకోవాలన్నారు. రుణాలు ద్వారా ప్రతి సభ్యురాలు ఇష్టమైన జీవనోపాధి ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సంఘం లావాదేవీలలో సభ్యులందరూ తప్పక భాగస్వామ్యం ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్ వల్లి, కో-ఆర్డినేటర్ ఆనంద్ బాబు, సీసీలు శంకర్ నాయక్, కృష్ణయ్య, వివోఏ రెడ్డి రాజేశ్వరి, సభ్యులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

పెనగలూరు: మండలంలో ఎక్కడైనా నీటి సమస్యలు ఉంటే ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టాలని పెనగలూరు మండల వైస్ ప్రెసిడెంటు కొండూరు విజయ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండలాధ్యక్షురాలు సౌందర్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెనగలూరు మండల నీటి సమస్యపై సభలో చర్చించారు. రానున్నది వేసవికాలం కావడంతో గ్రామాలలో నీటి సమస్య లేకుండా సంబంధిత అధికారులు ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తమ దృష్టికి తెస్తే వెంటనే చర్యలు చేపడతామని వారు తెలియజేశారు. మండలంలో ఎన్ని బోర్లు పనిచేస్తున్నాయి, ఎన్ని చేతిబోర్లు ఉన్నాయో వాటి గురించి ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రమణ వివరించారు. ఎక్కడైనా నీటి సమస్య ఉంటే వెంటనే పైపు లైన్ వేయడం, కుళాయిలు మార్చి నీటిసమస్యను నివారిస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, తహశీల్దార్ శ్రీధర్ రావు, జడ్పీటిసి సభ్యులు సుబ్బరాయుడు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం ఎగువగడ్డ హరిజనవాడకు చెందిన బంగి వెంకటరమణ అనే రైతు పొలంలో వేరుశనగ పంటలో పంటకోత ప్రయోగం నిర్వహించినట్లు మాస్టర్ ట్రైనర్ వెంకటరమణనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా వేరుశనగ పంటను సాగు చేశారన్నారు. ఈ సందర్భంగా 5/5 మీటర్లలో పంటకోత ప్రయోగం నిర్వహించగా 5.700 కేజీల దిగుబడి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు ప్రమీల, యశోదమ్మ, రామాంజులు, అరుణ, శివయ్య, రఘు, రైతులు పాల్గొన్నారు.

సృజన శక్తిని పెంపొందించాలి

– జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజ్

సిద్దవటం: ఉపాధ్యాయులు విద్యార్థులలోని మేధాశక్తిని, సృజనను పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజ్ తెలిపారు. సిద్దవటం లోని శ్రీ సాయి హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సైన్స్‌ఫేర్‌ను దేవరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ ఉపాధ్యాయులు చాలా అద్భుతంగా విద్యార్థులకు విద్యతో సైన్స్ పట్ల అనుబంధం వచ్చేట్టుగా తీర్చి దిద్దాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి శంకరయ్య , కరస్పాండెంటు వెంకటసుబ్బయ్య , ప్రిన్సిపల్ రేవతిదేవి, హెచ్ఎం రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రులు, క్లినిక్‌లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

– డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మధుసూదన్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : పట్టణంలోని అన్ని ప్రైవేటు క్లినిక్‌లు, నర్సింగ్ హోంలు, లాబోరేటరీలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆయన పట్టణంలోని భట్టువీధి, హరినాథవీధి, గాలివీడు రోడ్డు, బ్రాహ్మణ వీధిలలోని పలు ఆసుపత్రులు, క్లినిక్‌లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేని కొన్నింటిని గుర్తించారు. వాటి యాజమాన్యాలతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నర్సింగ్‌హోంలు, క్లినిక్‌ల ఏర్పాటుకు అనుమతుల కోసం డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 15 రోజుల లోపు దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఆయన హెచ్చరించారు. ఆయన వెంట పట్టణంలోని కె.రామాపురం అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యుడు వశీం అక్రమ్, హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి వద్ద పరిశీలన చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మధుసూదన్‌రెడ్డి

నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

– డీఎల్‌పీఓ నాగరాజు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పంచాయతీ పరిధిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా అనుమతులు తప్పనిసరిగా ఉండాలని, పంచాయతీ పరిధిలోని భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎల్‌పీఓ కె.నాగరాజు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ వేలం పాటల విధి విధానాలపై ఉప సర్పంచ్ తోట శివసాయితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విధిగా పంచాయతీలో నిర్మాణాలు చేపట్టే యజమానులు అనుమతులు తీసుకున్న తరువాతే పనులు ప్రారంభించాలన్నారు. అలాగే కోడూరు కొత్త బస్టాండ్ సమీపంలో సర్వేనంబర్ 51లో కోట్లాది రూపాయలు విలువచేసే పంచాయతీకి సంబంధించిన భూమిని కొందరు ఆక్రమిస్తున్నట్టు విలేకర్లు సమావేశం దృష్టికి తీసుకురావడంతో తక్షణం ఆయన స్పందించి సర్వేయర్‌ను పిలిపించి ఆ భూమి ఆక్రమణకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తే గ్రామాభివృద్ధి జరుగుతుందన్నారు.

ఇప్పటివరకు పంచాయతీకి సంబంధించి షాపింగ్ కాంప్లెక్స్‌లో 37 రూంలు ఉండగా ఆ షాపుల యజమానులు 9 లక్షల 71 వేలు బకాయిలు కట్టాలని తెలిపారు. ప్రస్తుతం లక్షా ఇరవైవేల వరకు బకాయిలు వసూలు చేసినట్టు తెలిపారు. బకాయిలు ఉన్న యజమానులు వెంటనే డబ్బులు చెల్లించాలని, బాకీ ఉన్న మొత్తం చెల్లిస్తేనే తరువాత జరగబోవు యాక్షన్‌లో అర్హులు అవుతారని తెలియజేశారు. పంచాయతీ అప్రూవల్ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని, పేమెంట్ కూడా ఆన్‌లైన్‌లోనే జరుగుతాయన్నారు. పంచాయతీ అప్రూవల్ లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగార్జున, ఈవో రామసుబ్బారెడ్డి, సర్పంచ్ శివయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ కె.నాగరాజు, ఉపసర్పంచ్ తోట సాయి

వన్యప్రాణులను సంరక్షించాలి

సంబేపల్లె : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వన్యప్రాణి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ వన్య జంతువులు, మొక్కల మనుగడతోనే మానవాలి మనుగడ సాధ్యమన్నారు. ప్రజలు తన జీవనోపాధి, ఆర్థిక అవసరాలకు ప్రకృతిపై ఆధారపడివుంటారని తెలిపారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ కోర్ విద్యార్థులు వన్యప్రాణల ఆవశ్యకత గురించి వివరించాలన్నారు. వన్యప్రాణుల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

నాణ్యమైన విద్య, ఆహారం అందించాలి

– డీఎల్‌డీఓ నరసింహ మూర్తి



కస్తూర్బా గాంధీ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

పెనగలూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని డీఎల్‌డీఓ నరసింహ మూర్తి అన్నారు. శనివారం కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాలను ఎంపీడీఓ వరప్రసాద్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను, వంట గదిని, రీడింగ్ రూమ్‌ను పరిశీలించారు. రికార్డుల పరిశీలన అనంతరం పాఠశాలలో 40 మంది విద్యార్థులు డ్రాపౌట్స్ అయ్యారని, డ్రాపౌట్స్ పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో అన్ని సదుపాయాలు ఉన్నా డ్రాపౌట్స్ సమస్య బాధాకరమన్నారు. మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇంటర్ విద్యార్థుల పర్‌ఫార్మెన్స్ గురించి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు, పాఠశాల సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార పొట్లాలు పంపిణీ

రాజంపేట రూరల్: మండల పరిధిలోని అత్తిరాల సమీపంలోని ఎస్టీ కాలనీలో ఆహార పొట్లాలను అందజేశారు. కేంద్ర పురావస్తుశాఖ రాష్ట్ర కార్యదర్శి చెంగారి రామాంజనేయులు తన సతీమణి రత్నమ్మ 4వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టారు. పది మందికి సేవ చేస్తే వచ్చే సంతృప్తి వేరని తెలియజేశారు.

అటవీ సంరక్షణపై అవగాహన

రామాపురం : ప్రజలందరూ అటవీ సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని ఎఫ్ఆర్ఓ స్ఫూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గువ్వలచెరువులో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతూ ప్రజలందరూ అటవీ సంరక్షణలో భాగస్వాములు కావాలని, ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. అడవికి నిప్పు పెట్టకూడదని, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటరమణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ తిమ్మారెడ్డి, ఎఫ్‌బీఓలు మహబూబ్‌బాషా, మున్నా పాల్గొన్నారు.

రాజంపేటలో రూ.7లక్షలు పట్టివేత



రాజంపేట: రాజంపేట– రాయచోటి రహదారిలోని కూచివారిపల్లె వద్ద రూ.7లక్షలు శుక్రవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నరసింహారావు మాట్లాడుతూ నరేష్ అనే వ్యక్తి తీసుకొని వెళుతున్న నగదుకు ఎటువంటి ఆధారాలు లేవన్నారు. దీంతో నగదును సంబంధిత అధికారులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు పాల్గొన్నారు.

కో ఆర్డినేటర్ల నియామకం

సంబేపల్లె : సిఎస్ఈ పాఠశాలలకు సమన్వయ అధికారులుగా సంబేపల్లె, కేవిపల్లె మండలాలలోని ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాల్‌లను నియమించినట్లు సంబేపల్లె ఆదర్శపాఠశాల ప్రిన్స్‌పాల్ దిలీప్ కుమార్ తెలిపారు. ఆదర్శ పాఠశాలల కార్యదర్శి ఎం, వెంకటక్రిష్ణారెడ్డి ఉత్తర్వులు శుక్రవారం విడుదల చేసినట్లు తెలిపారు. అనంతరం సిఎస్ఈ కి ఎంపికైన దిలీప్, రెడ్డిప్రదీప్‌లను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.